క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

కేజీబీవీలో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో బన్నాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడోతరగతి ఉత్తీర్ణులై, 45 ఏళ్లలోపు వయసున్న స్థానిక మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీలోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

రుద్రంగి: మండలంలోని చింతామణి తండాకు చెందిన గుగులోతు హరిసింగ్ అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హరిసింగ్ ఈ నెల 13న ఇంట్లో భార్య దేవితో గొడవపడి, రాత్రి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య మంగళవారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. హరిసింగ్ తెల్ల చొక్కా ధరించి ఉన్నాడని, అతని ఎడమ చేతిపై పచ్చబొట్టు ఉంటుందని, ఎత్తు 5.11 అడుగులు ఉంటాడన్నారు. ఆచూకీ తెలిస్తే రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో గానీ, ఎస్సై ఫోన్ నంబర్ 8712656422కు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

పరారైన వాహనదారుడి కోసం గాలింపు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారు పెట్రోల్ బంకు వద్ద మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని ఢీకొట్టి పరారైన వాహనదారుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నెల 15న రాత్రి టూవీలర్‌పై వెళ్తూ.. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడని ఎస్సై రమాకాంత్ తెలిపారు. సంఘటన స్థలంలో బైక్ డోమ్, విరిగిన భాగాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వాటిని వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేశామని, వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కోనరావుపేట: రామన్నపేట–కొలనూర్ గ్రామాల మధ్య కాజ్‌వేకు ఒకవైపు కల్వర్టు పగుళ్లతో ప్రమాదకరంగా ఉంది. ఈ దారిలో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రెండోవైపు కూడా చిన్న గుంత ఏర్పడింది. అధికారులు స్పందించి, కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

లక్ష్మీపూర్‌లో డ్రై డే



తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో డ్రై డేను వైద్యాధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, నీరు నిల్ల ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల లార్వాను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నయిమా, హెచ్‌ఈవో లింగం, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ సాయికుమార్, ఏఎన్‌ఎం మంజుల, ఆశవర్కర్ రమ పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి



మహేశ్‌గౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటకు చెందిన చేపూరి మహేశ్‌గౌడ్ (28) గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మహేశ్‌గౌడ్ నిత్యం కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడిది రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబమని, అతని తల్లిదండ్రులు వజ్రమ్మ–ఎల్లాగౌడ్ వృద్ధాప్యంలో ఉన్నారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు నమిలికొండ శ్రీనివాస్ తెలిపారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బస్టాండ్‌లో.. సమస్యలెన్నో

- మరుగుదొడ్లకు నీటి కరువు
- తాగునీటికి హోటళ్లకు..
- బురదమయంగా ప్రాంగణం
- బస్సుల సమాచారం తెలిపేందుకు కంట్రోలర్ లేరు
- ప్రయాణికులకు ప్రైవేటు వాహనాలే దిక్కు
- ఎల్లారెడ్డిపేటలో పరిస్థితి



ఎల్లారెడ్డిపేట బస్టాండ్

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో మేజర్ మండలం ఎల్లారెడ్డిపేట. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యల ప్రాంగణంగా మారింది. ప్రతీరోజు సుమారు 100 బస్సులు వచ్చి వెళ్తుండగా.. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు. ప్రయాణికులు కూర్చోడానికి కనీసం బల్లాలు లేవు. మారుమూల గ్రామాలకు వెళ్లేవారికి ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. కంట్రోలర్ లేక బస్సు వేళలు చెప్పేవారు కరువయ్యారు. దీంతో ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. బస్టాండ్‌లో ప్రైవేట్ వ్యక్తులు ఇష్టారీతిన తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కనీసం బోరు వేయకపోవడంతో ప్రయాణికులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. హోటళ్లకు వెళ్లి, కొనుగోలు చేసి, దాహార్తి తీర్చుకుంటున్నారు. బస్టాండ్ ప్రాంగణమంతా పారిశుధ్య లోపంతో కంపుకొడుతోంది.

పెద్ద పెద్ద గుంతలు..

బస్టాండ్ ప్రాంగణమంతా చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో బస్సులు ఒక్కోసారి బస్టాండ్‌లోకి రాకుండానే ప్రధాన రహదారి గుండా వెళ్లిపోతున్నాయి. బురద బాధలు తీర్చేందుకు పూర్తిస్థాయిలో సీసీ వేయాలని, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా కాంట్రాక్టు పద్ధతిలో కూలీలను నియమించాలని ప్రజలు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి.

పట్టించుకోని అధికారులు..

సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న ఈ బస్టాండ్ నుంచి ముంబయి, మహారాష్ట్రతోపాటు హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ తదితర జిల్లాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెట్టే బస్టాండ్‌లో సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు



బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

దుర్వాసన వస్తోంది



బస్టాండ్‌లో మరుగుదొడ్లు వినియోగంలో లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ప్రాంగణంలో వ్యర్థాలను వదిలేయడంతో దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించాలి.

– ఒగ్గు బాలరాజు యాదవ్, ఎల్లారెడ్డిపేట

వసతులు కల్పిస్తాం



ఎల్లారెడ్డిపేట బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కల్పిస్తాం. వాహనాలు పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకుంటాం. మరుగుదొడ్ల ను అందుబాటులోకి తెచ్చి, కంట్రోలర్‌ను నియమిస్తాం.

– మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

నీరు.. పందులు.. దోమలు

- వేములవాడ మార్కండేయనగర్ నివాసాల మధ్యే..
- డెంగీ జ్వరం ప్రబలుతోందని స్థానికుల ఆవేదన
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



ఇళ్ల మధ్య నిలిచిన నీరు, ఆ పక్కనే సంచరిస్తున్న పందులు

వేములవాడ: పట్టణంలోని మార్కండేయనగర్ ఇళ్ల మధ్యలో నీరు నిలుస్తోంది. దీంతో పందులు సంచారం ఎక్కువైంది. దోమలు పెరిగిపోయి డెంగీ జ్వరం ప్రబలుతోందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి కాలనీలో జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెబుతున్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా సమస్యకు పరిష్కారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'భగీరథ' పైపులైన్ లీకేజీ

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా నీళ్లన్నీ తమ ఇళ్ల మధ్యకు చేరుతున్నాయని స్థానికులు అంటున్నారు. కౌన్సిలర్ గూడూరి లక్ష్మి, కమిషనర్ అన్వేశ్‌లకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తాము రోగాలతో ఆస్పత్రులపాలవుతామని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి, పైపులైన్‌కు మరమ్మతు చేసి, పందులు, దోమల బెడద తీర్చాలని కోరుతున్నారు.

రోగాలబారిన పడుతున్నం



మా కాలనీలో నీరు నిలిచి, పందులు సంచరిస్తున్నాయి. ఇటీవల రెండు పందులు చనిపోయాయి. దుర్వాసన భరించలేకపోయాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా అబ్బాయికి డెంగీ జ్వరం వచ్చి, ఇబ్బంది పడుతున్నాం. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి. – వేముల పద్మ, మార్కండేయనగర్

చర్యలు తీసుకుంటాం

మార్కండేయ కాలనీలో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. కాలనీకి సిబ్బందిని పంపించి, స్థానికులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలి



సిరిసిల్లలో ర్యాలీ తీస్తున్న కౌన్సిలర్ శైలు, టీచర్లు, పిల్లలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని అన్ని వార్డుల్లో మంగళవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. 13వ వార్డులో కౌన్సిలర్ జాగీరు శైలు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టీచర్ రజని తదితరులున్నారు. గణేశ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్పీ అరుణ, అంగన్‌వాడీ టీచర్ వింధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టీచర్ వాణి మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు బాలబాలికలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎస్టీ సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



బెల్లయ్య నాయక్‌ను సత్కరిస్తున్న ఎల్లారెడ్డిపేట గిరిజన నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ఎస్టీ సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను ఎల్లారెడ్డిపేట మండల గిరిజన సంఘాల నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీలో అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న వారికి కార్పొరేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పార్టీ మండల యువజన అధ్యక్షుడు బానోతు రాజునాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుగులోతు హరిలాల్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మున్నిసింగ్ రాథోడ్, ఎల్‌హెచ్‌పీహెచ్ జిల్లా అధ్యక్షుడు గజన్‌లాల్ నాయక్, నాయకులున్నారు.



వీర్నపల్లి మండల నాయకులు..

వీర్నపల్లి: మండలంలోని గిరిజన సంఘాల నాయకులు మంగళవారం ఎస్టీ సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వీర్నపల్లి మండలంలోని గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోడు భూముల సమస్య, అభివృద్ధి పనులపై వినతిపత్రం అందించారు. నాయకులు హరిలాల్, గజన్‌లాల్, భాస్కర్, ప్రకాశ్, రాములు రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇల్లంతకుంటలో ఎమ్మెల్యే 'కవ్వంపల్లి' పర్యటన

తంగళ్లపల్లి: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఇల్లంతకుంట మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు గాలిపెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పెట్రోల్ పంపు, మధ్యాహ్నం 12 గంటలకు ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పెట్రోల్ పంపును పునఃప్రారంభించనున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

బోర్‌వెల్ పరిశీలన



బోర్‌వెల్ పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ఉమారాణి

బోయినపల్లి: మండలంలోని కొదురుపాకలో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను జెడ్పీ సీఈవో ఉమారాణి మంగళవారం పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న పనులు క్షేత్రస్థాయిలో జరిగాయో లేదో చూశారు. ఆమె వెంట ఎంపీడీవో జయశీల, పంచాయతీ కార్యదర్శి అంజలి తదితరులున్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం



సన్మానించిన విండోల చైర్మన్లు దేవదాస్, భాస్కర్, వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి

తంగళ్లపల్లి: మాజీ ఎంపీపీ పడిగెల మానస, ఎంపీటీసీ మాజీ సభ్యులను సిరిసిల్ల సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో సన్మానించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. తన పదవీకాలంలో మండల అభివృద్ధికి సహకరించిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల, నేరెళ్ల విండో చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోడి అంతయ్య, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, మండల మాజీ అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్‌రావు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై, 2 నెలలు కావొస్తున్నా ప్రభుత్వం వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. చాలా హాస్టళ్లలో భోజనం నాణ్యతగా ఉండటం లేదని, పలుచోట్ల బాత్రూంలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు వెంకటేశ్, తిరుపతి, శ్రీనివాస్, వంశీ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



అధికారులపై ఆగ్రహిస్తున్న వెంకటాపూర్ గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: గ్రామంలో కొంతమంది అక్రమంగా వెంచర్లు వేశారని, అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామ శివారులోని 44 ఎకరాల్లో వెంచర్లు వేసి, ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రతీ ఎకరాకు 4 గుంటల స్థలాన్ని గ్రామ పంచాయతీకి ఇవ్వాలని తమతో ఒప్పందం చేసుకున్నారని అన్నారు. కానీ, సంబంధించిన లెక్కలు చూపించడం లేదని, ఆ స్థలం ఇచ్చారా లేదా అనే దానిపై స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ భూమి ఇస్తే ఎక్కడ ఇచ్చారో హద్దులు చూపాలన్నారు. గ్రామ పంచాయతీలో అక్రమాలు జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామంలోని గుట్టలను తవ్వి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, వాటిని కూడా వెంచర్లుగా వేశారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ సమక్షంలో గ్రామసభ నిర్వహించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చందు, సన్నీ, చరణ్, ప్రవీణ్, మనోహర్, మధు తదితరులు పాల్గొన్నారు.

కోతల్లేని నాణ్యమైన విద్యుత్ అందించాలి



సెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి: మండలంలోని రైతులకు, గృహావసరాలకు, చిన్నతరహా పరిశ్రమలకు కోతల్లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సెస్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవసరం ఉన్నచోట్ల కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సెస్ ఏఏఈ ప్రశాంత్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉదారి నర్సింహాచారి, ఎడపల్లి పర్శరాం, క్యాతం తిరుపతిరెడ్డి, కొనుకటి హరీశ్, రాజూరి కిరణ్, గంగాధర్‌చారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది

రుద్రంగి: పరిసరాల పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చని ఆర్‌బీఎస్‌కే వైద్యులు ప్రభాకర్, అభినయ అన్నారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు విజయ, దివ్య, ఫార్మసిస్టు సంధ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

పీరీల ఊరేగింపు





వీర్నపల్లి: మండల కేంద్రంలోని మసీదు వాడ నుంచి బస్టాండ్ తదితర కాలనీల్లో మంగళవారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు మొక్కు చెల్లించుకున్నారు. మాజీ ఉపసర్పంచ్ బోయిని రవి, డాక్టర్ నర్సయ్య, గుమ్మడి రాజేశం, లెంకల లక్ష్మణ్, శ్రీరామ్ నాయక్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న పులి వేషధారణ

బోయినపల్లి: మండలంలో పీర్ల పండుగ సందడి కొనసాగుతోంది. మొహర్రం నేపథ్యంలో మంగళవారం బోయినపల్లిలో పలువురు పులి వేషధారణలో ఆకట్టుకున్నారు. డప్పుచప్పుళ్లకు తగ్గట్టుగా నృత్యం చేస్తూ స్థానికులను ఉత్సాహపరిచారు.

ట్రాక్టర్ ఇంజిన్‌ను ఢీకొన్న కారు



ప్రమాద దృశ్యం (సీసీ ఫుటేజీ)

తంగళ్లపల్లి: కారు ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం తంగళ్లపల్లి నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఇంజిన్‌ను మండల కేంద్రంలో వెనక వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ టైరు పగిలింది. డ్రైవర్ దూరంగా ఎగిరి పడిపోయాడు. కానీ, అతనికి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యింది. దీని ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు చెదిరి.. ప్రమాదకరంగా మారి



పదిర వంతెనపై కంకర తేలిన రోడ్డు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర బస్టాండ్ శివారు రాపెల్లివాగు వంతెనపై సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి చెదిరి, కంకర తేలింది. నిత్యం ఈ దారిలో వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట భయంభయంగా వెళ్తున్నామని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.